సాక్షి
చిత్తూరు
గురువారం । 31 । ఆగస్టు । 2023



పల్లెవాసులకు పక్కాగా ఆస్తి హక్కు
పల్లెల్లో తరతరాలుగా ఎలాంటి పత్రాలు లేని స్థలాలకు యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. - 8లో



శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం
కాణిపాకం దేవస్థానం అనుబంధ శ్రీవరదరాజుల స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా సత్యనారాయణ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	33	24
తిరుపతి	34	25
తిరుమల	39	21
గూడూరు	36	27
నగరి	35	25

న్యూస్‌రీల్

బోయకొండలో చండీ హోమం



చౌడేపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా బుధవారం చండీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో మూలమూర్తికి, ఉత్సవమూర్తికి పూజలు నిర్వహించారు. చండీ హోమ పూజల్లో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన ప్రజలు పాల్గొన్నారు. పూర్ణాహుతి అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు.

కౌలు రైతులకు భరోసా

- నేడు జమ కానున్న సాగు పెట్టుబడి నిధులు
- జిల్లాలో 1,091 మందికి లబ్ధి

చిత్తూరు అగ్రికల్చర్: ప్రభుత్వం కౌలు రైతుల ఆర్థికాభివృద్ధికి కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా పంటలు సాగుచేసే రైతులకు ముందస్తు పెట్టుబడి కింద అందించే రైతు భరోసా నిధుల తరహాలోనే కౌలు రైతులకు భరోసా నిధులను అందించేందుకు చర్యలు తీసుకుంది. జిల్లాలోని కౌలు రైతుల ఖాతాలకు గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంతో ఈ ఏడాదికి మొదటి విడత రైతులు భరోసా నిధులను జమ చేయనున్నారు. జిల్లాలోని కౌలు రైతులకు 2019 నుంచి ఏటా పంటల సాగుకు ముందస్తు పెట్టుబడి నిధిని రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం అందిస్తోంది. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 1,091 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులను మంజూరు చేశారు. గత నాలుగేళ్లుగా కౌలు రైతులకు కూడా ఏడాదికి రూ.13,500 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది. 2019–20లో 168 మందికి, 2020–21లో 417 మందికి, 2021–2022లో 555 మందికి, 2022–23లో 51 మందికి లబ్ధి చేకూరింది. ఈ ఏడాది 1,091 మందికి రైతు భరోసా నిధులను నేరుగా జమ చేయనున్నారు.

విలేజ్ క్లినిక్ సేవలు మరింత మెరుగు

చిత్తూరు రూరల్: డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్ సేవలను మరింత మెరుగుపరచాలని డీఎం అండ్‌హెచ్‌ఓ ప్రభావతి దేవి అన్నారు. బుధవారం డీఅండ్‌హెచ్‌ఓ కార్యాలయ సమావేశ మందిరంలో మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు నేషనల్ క్వాలిటీ అసురెన్స్ సర్వీసుపై శిక్షణ ఇచ్చారు. వాడిని వస్తువులను ఏ విధంగా భద్రపరచాలి అనే విషయ సూచనలు ఇచ్చారు. బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ద్వారా వాటి తరలింపు ప్రక్రియను క్షుణంగా వివరించారు. డీఎంఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సిబ్బందికి మెటీరియల్ పంపిణీ చేశారు.

జంతువుల చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి డాక్టర్ కరుణకుమార్


చిత్తూరు అగ్రికల్చర్: జంతువుల చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగిఉండాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణకుమార్ తెలిపారు. బుధవారం స్థానిక పశుసంవర్ధక శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో ఆ శాఖ అధికారులకు జంతువుల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మనుషులకున్నట్టే జంతువులకు కూడా హక్కులు, చట్టాలు ఉన్నాయన్నారు. జంతువులను అక్రమంగా తరలించడం చట్టరీత్యా నేరమని చెప్పారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో సమానమని తెలిపారు. లోక్ అదాలత్‌లో ఎస్సీ, ఎస్టీలు ఉచితంగా న్యాయ సేవలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్ , డీడీలు, ఏడీలు పాల్గొన్నారు.

సౌత్ రీజినల్ వర్క్‌షాప్‌నకు జెడ్పీ సీఈఓ

చిత్తూరు కార్పొరేషన్: సౌత్ రీజినల్ స్థాయిలో సెప్టెంబర్ 1,2 తేదీల్లో నిర్వహించనున్న వర్క్‌షాప్‌నకు జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ అధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం అనే అంశంపై బెంగళూరులో ఈ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈవర్క్‌షాప్‌నకు ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. జిల్లా నుంచి జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఎంపికయ్యారు.

గజగజ లాడించి..!

ఇప్పటి వరకు పడమటి మండలాల వరకే పరిమితమైన గజదాడులు చిత్తూరులోనూ మొదలయ్యాయి. బుధవారం గుడిపాల, చిత్తూరు నగర శివారుల్లో మదపుటేనుగు సృష్టించిన బీభత్సంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం.. మరొకరు తీవ్రంగా గాయపడడం ఉలికిపాటుకు గురిచేసింది. తమిళనాడు అడవుల నుంచి వచ్చిన ఏనుగు.. గుంపు నుంచి దారి తప్పిపోవడంతోనే ఈ మారణకాండ సృష్టించినట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. మదపుటేనుగును వచ్చిన దారిలోనే తిరిగి పంపించేందుకు కుమ్కి ఏనుగుల ద్వారా అధికారులు ఆపరేషన్ మొదలుపెట్టారు.



- ఒంటరి ఏనుగు విధ్వంసంతో ఉలికి పడిన గుడిపాల
- రెండురోజులుగా ఇక్కడే మకాం
- దంపతుల మృతితో రామాపురంలో విషాదం
- మరొకరి పరిస్థితి విషమం... పాడి ఆవు, దూడ మృత్యువాత
- వణుకుతున్న గ్రామీణ జనం
- కుంకీ ఏనుగుల ద్వారా అటవీశాఖ ఆపరేషన్





వెంకటేశ్వర్లు, సెల్వి మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు, గ్రామస్తులు (ఇన్‌సెట్) దంపతులు (ఫైల్)

గుడిపాల/ చిత్తూరు రూరల్: గుడిపాల, చిత్తూరు నగర శివారుల్లో మదపుటేనుగు విధ్వంసంతో ఈ ప్రాంత వాసులు భీతిల్లిపోయారు. గుడిపాల మండలం 190 రామాపురానికి చెందిన వెంకటేశ్వర్లు (54), భార్య సెల్వి (47)తో కలిసి లక్ష్మీపురం వద్ద ఉన్న పంటపొలానికి వెళ్లి ఏనుగు దాడిలో బలైయ్యారు. మదపుటేనుగు వెంబడించి దంపతులను తొక్కిసింది. దీంతో భార్యభర్తలు నుజ్జు..నుజ్జుగా మారి వంద అడుగుల దూరంలో విగతజీవులుగా మారారు. దాడిసమయంలో వీరి కేకలు విని స్థానికులు ఇంటి నుంచి బయటకు వచ్చారు. ఘటన స్థలం నుంచి ఏనుగు మెల్లగా కాలువలోకి జారుకోవడంతో స్థానికులు కొన ఊపిరితో కొట్టుకున్న వెంకటేశ్వర్లుకు నీళ్లు తాగించారు. తర్వాత రెండు నిమిషాల్లో చనిపోయాడని స్థానికులు చెబుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ఇద్దరు బలి అయ్యారని బంధువులు, గ్రామస్తులు జాతీయ రహదారిపై ధర్నా చేశారు. వారికి ప్రజాప్రతినిధులు, అధికారులు నచ్చచెప్పి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సాయంత్రం పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏనుగు దాడిలో భార్యభర్తలు మృతిచెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

దారి తప్పి..బీభత్సం సృష్టించి

తమిళనాడు అటవీ ప్రాంతం నుంచి మంగళవారం తెల్లవారుజామున ఒంటరి మదపుటేనుగు దారితప్పింది. అలా యాదమరి మండలం కొటాల పంట పొలాల మీదుగా మళ్లింది. చిత్తూరు నగర పరిధిలోని శేషాచలపురంలో రాత్రి 7 గంటల సమయంలో హల్‌చల్ చేసింది. అక్కడి నుంచి గుడిపాల మండలంలోకి అడుగుపెట్టి గజగజ వణికించింది. బుధవారం ఉదయం 6 గంటలకు రాసనపల్లె బీడు భూముల్లో గ్రామస్తులను భయపెట్టింది. 6.45కు సీకేపల్లెలోని సుధాకర్‌నాయుడు మామిడితోటలో దర్శనమిచ్చింది. ఆప్రాంతంలో పనిచేస్తున్న బసవపల్లెకు చెందిన కార్తీక్(25)అనే యువకుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. అక్కడి నుంచి 7.30కు మిట్టూరు గ్రామానికి చేరుకున్న ఏనుగు రమణారెడ్డి పాడి ఆవుపై దాడి చేయడంతో మృతి చెందింది. అనంతరం చుట్టు పక్కల ఉన్న పంట పొలాలపై విరుచుకుపడి తొక్కివేసింది. ఈ సమయంలో అటవీ శాఖ అధికారులు చేరుకుని ఏనుగును కట్టడి చేసే ప్రయత్నం చేశారు. వారు ఏనుగును అదుపు చేయలేకపోవడంతో 8.10 గంటలకు ముట్టుకూరుపల్లెలోని పాడిరైతు ఏకాంబరం షెడ్డును కూల్చివేసి..వెంకటేష్ దూడను చంపేసింది. 8.50 గంటలకు లక్ష్మీపురం చేరుకుంది. అక్కడ పంటపొలంలో భార్యభర్తలు ఏనుగు దాడికి బలయ్యారు. ప్రస్తుతం అక్కడే ఏనుగు బస చేయడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఏనుగుకు చిక్కి తీవ్రంగా గాయపడిన బసవపల్లెకు చెందిన కార్తీక్ (25) తమిళనాడు రాణిపేట సీఎంసీలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు.

భయభ్రాంతుల్లో గ్రామస్తులు

గుడిపాల ప్రాంతంలో మదపుటేనుగు దాడుల నేపథ్యంలో లక్ష్మీపురం, అరుల్‌పురం, 190 రామాపురం వాసులు గజగజ వణికిపోతున్నారు. లక్ష్మీపురం ప్రాంతంలోనే ఉదయం 9.45 గంటల నుంచి ఏనుగు మకాం వేసి ఉండడంతో గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి ఏనుగు నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. అటవీశాఖ అధికారులు ఒంటరి ఏనుగును అదుపులోకి తీసుకునేందుకు కుప్పం నుంచి కుంకీ ఏనుగులను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ కుంకీలతో మదపుటేనుగును కట్టడి చేయవచ్చునన్ని భావిస్తున్నారు.

పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబం

గుడిపాల/చిత్తూరు రూరల్: ఫ్యాక్టరీలో పనిచేస్తూ..వ్యవసాయమే ఆధారంగా చేసుకుని జీవించే కుటుంబం వాళ్లది. కొద్దిపాటిగా కూరగాయలు పండించుకుంటూ కుటుంబం కష్టాలను పూడ్చుకునేవారు. భర్తతో పాటు భార్య కూడా పొలం పనుల్లోనే గడిపేది. ఇలా పొలం కాడికి వెళ్లిన దంపతులను ఏనుగు బలితీసుకుంది. 190 రామాపురానికి చెందిన వెంకటేశ్వర్లు, సెల్వి దినసరి కూలీతో పాటు కొద్దిపాటిగా వ్యవసాయం చేసుకుంటూ పూటగడుపుతున్నారు. వెంకటేశ్వర్లు గుడిపాలలోని ఓ ప్రైవేటు ఫ్యాక్టరీలో సెక్యూరిటీగా పనిచేస్తున్నాడు. అలాగే లక్ష్మీపురం గ్రామం వద్ద ఉన్న ఎకరా పొలంలో పలు రకాల పంటను సాగు చేసుకుంటున్నారు. ఈ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడు విక్రమ్ బెంగుళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రెండవ కుమారుడు రాకేష్ చిత్తూరులో ప్రైవేటు బ్యాంకులో, మూడవ కుమారుడు సింధూ దేవాలయాలకు పెయింటింగ్ పని చేస్తుంటారు. ఇందులో పెద్దకుమారుడికి మాత్రం పెళ్లయి పిల్లలున్నారు. ఆ ముగ్గురూ కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో గ్రామస్తులను కలచివేసింది.



మృతదేహాలను తీసుకొస్తున్న గ్రామస్తులు



వణికిస్తున్న ఒంటరి ఏనుగు



రోడ్డుపై ధర్నాకు దిగిన గ్రామస్తులు, బంధువులు

పగబట్టడంతో భీ'కరి'దాడులు

- పదేళ్లలో 20 మంది మృత్యువాత
- బాణసంచా, టైర్లను కాల్చడంతోనే కసి
- జనం నుంచి ముప్పు ఉందనే భయంతోనే దాడులు



మొగిలి ఘాట్‌లో సంచరించే మదపుటేనుగు(ఫైల్)

కౌండిన్యలో సంచరించే ఏనుగులు	ఇక్కడి అడవిలోనే సంచరించే ఏనుగులు
107	67
తమిళనాడు నుంచి తరచూ వచ్చే ఏనుగులు	కర్ణాటక నుంచి వచ్చే ఏనుగులు
24	16
మొత్తంలో మదపుటేనుగులు	ఇప్పటిదాకా దాడిలో మృతిచెందినవారు
06	20
గాయపడినవారు 30 మందికిపైగా	

పలమనేరు: జిల్లాలో గజరాజుల నుంచి జనానికి ప్రాణహాని తప్పడం లేదు. ముఖ్యంగా మనషులపై పగబట్టిన మదపుటేనుగులు ఒంటరిగా సంచరిస్తూ భీకర దాడులు చేస్తున్నాయి. గత పదేళ్లలో ఈ ప్రాంతంలో ఏనుగుల కారణంగా 18మంది మృత్యువాత పడ్డారు. తాజాగా గుడిపాల మండలంలో ఇద్దరు దంపతులు మదపుటేనుగు దాడిలో మృతి చెందారు. దీంతో ఏనుగుల దాడిలో మృతిచెందిన వారి సంఖ్య ఇరవైకి చేరింది. రెండు నెలల కిందట కుప్పం సమీపంలోని పత్తిచేను వద్ద ఉష, సప్పని కుంట వద్ద శివలింగాన్ని ఏనుగులు తొక్కి చంపాయి. ఆపై కృష్ణగిరి సమీపంలో ఓ వ్యక్తిని ఏనుగులు ఘోరంగా చంపాయి. తమిళనాడు రాష్ట్రం నుంచి ఇటువైపు కొస్తున్న మదపుటేనుగులు విచక్షణారహితంగా దాడులకు పాల్పడుతున్నాయి. దీంతో అటవీసమీప ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

మదపుటేనుగులే దాడులు

పలమనేరు, కుప్పం, చిత్తూరు ఫారెస్ట్‌రేంజ్‌ల పరిధిలోని కౌండిన్య అభయారణ్యంలో సంచరించే ఏనుగులతో పాటు పొరుగు రాష్ట్రాలనుంచి కౌండిన్యలోకి వచ్చే మొత్తం ఏనుగుల్లో 12 మదపుటేనుగులుండేవి. వీటిల్లో కరెంట్‌షాక్‌లు, అనారోగ్యం, రోడ్డు ప్రమాదాలు తదితరాలతో ఆరు మృతిచెందగా, ప్రస్తుతం ఆరు మాత్రమే మదపుటేనుగులు ఒంటరిగా సంచరిస్తున్నాయి. వీటిలో మొగిలి ఘాట్, ముసలిమొడుగు, పెంగరగుంట, వెంగంవారిపల్లె, రఘునాయకుల దిన్నె, పెద్దపంజాణి మండలంలోని అడవుల్లో గుంపునుంచి దూరంగా ఉండి ఒంటరిగా ఎంపిక చేసుకున్న ఆయా ప్రాంతాల్లోనే సంచరిస్తున్నాయి. ఇవి చాలా క్రూరంగా ప్రవర్తిస్తుంటాయి. మనుషులు, పశువులు, కుక్కలను తరిమి తరిమి చంపుతాయి.

ఆగ్రహంతో ఊగిపోతూ...

మదపుటేనుగులపై జనం రాళ్లను విసరడం, టపాకాయలను పేల్చడం, టైర్ల కాల్చి వాటి శరీరంపైకి విసరడం లాంటి చర్యలతో మగ ఏనుగులు జనంపై కసిని పెంచుకుంటున్నాయి. ఆడ ఏనుగులుకున్నంత సహనం వీటికి ఉండదు. ఇప్పటిదాకా పరిశీలిస్తే మదుపుటేనుగు యాదమరి మండలం దిగువకనతల చెరువువద్ద అటవీశాఖ డ్రైవర్ సతీష్, వీరమానికుంటవద్ద ఫారెస్ట్ సిబ్బందిపై దాడి చేసింది. ఆపై ముగ్గురు ఎలిఫెంట్ ట్రాకర్స్‌ను తొండంతో విసిరి వేసింది. పందేరుపల్లె వద్ద రైతును, కాలువపల్లె వద్ద సెల్‌ఫోన్ వేశాడని యువకుడిని తొండంతో కొట్టి చంపేసింది మదపుటేనుగులే. పెద్దపంజాణి మండలం పెనుగొలకలకు చెందిన బంగారప్పను, కాలువపల్లి వద్ద రైతు సుబ్రమణ్యంను చంపింది మదపుటేనుగులే. కుప్పంలోనూ దాడులు చేసింది ఇవే. పదిరోజుల కిందట పెద్దపంజాణి మండలంలో రైతును తొక్కి చంపిందే మదపుటేనుగే. ఇప్పుడు గుడిపాల మండలంలో దంపతులను చంపిందే మదపుటేనుగే.

మదపుటేనుగులకు ఆగ్రహం ఎక్కువ



గుంపులనుంచి వేరుగా ఉంటూ ఒంటరిగా సంచరించే మదపుటేనుగులు చాలాఆగ్రహంగా ఉంటాయి. వీటి బారినుంచి తప్పించుకోవాలంటే ఏనుగు తరముకున్న మనిషి నేరుగా కాకుండా ఎస్ ఆకారంలో వెళ్లాలి. ఒంటిపై ఉన్న బట్టలను తీసి ఏనుగు ముందు వేస్తే అది కాసేపు దాన్ని వాసన చూస్తు తొక్కుతుండగా ఆ గ్యాప్‌లో తప్పించునే అవకాశం ఉంటుంది.

శివన్న, ఎఫ్ఆర్వో, పలమనేరు

ఏనుగు కట్టడికి విస్తృత చర్యలు

- ననియాల నుంచి జయంతి, వినాయక రాక
- గజ బాధిత కుటుంబానికి నేడు రూ.10 లక్షల సాయం
- జిల్లా అటవీ శాఖాధికారి చైతన్యకుమార్‌రెడ్డి



ఒంటరి ఏనుగును పట్టుకునేందుకు వచ్చిన జయంతి, వినాయక



గుడిపాల: ఒంటరి ఏనుగును పట్టుకొనేందుకు విస్తృత చర్యలు ప్రారంభించినట్లు జిల్లా అటవీ శాఖాధికారి చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. ఒంటరి ఏనుగు కట్టడికి రామకుప్పం మండలం ననియాల ట్రైనింగ్ సెంటర్ నుంచి జయంతి, వినాయక(ఏనుగులు)ను ఈచర్ వ్యాన్ ద్వారా బుధవారం రాత్రి రప్పించారు. ఈ సందర్భంగా చైతన్యకుమార్‌రెడ్డి మాట్లాడుతూ పది పాడి ఆవులు మృతి చెందినట్లు వదంతులు వస్తున్నాయని, అవంతా అవాస్తమని తెలిపారు. ఒక పాడిఆవు, ఒకదూడ మాత్రమే మృతి చెందినట్లు స్పష్టం చేశారు. బుధవారం రాత్రికి ఒంటరి ఏనుగును పట్టుకునేందుకు మరో రెండు ఏనుగులను రంగంలోకి దింపామన్నారు. మృతి చెందిన భార్యాభర్తలు వెంకటేశ్వర్లు, సెల్వికి ప్రభుత్వం నుంచి రూ.10 లక్షలను గురువారం అందజేస్తామని తెలిపారు. మంగళవారం రాత్రి నుంచి 50 మంది సిబ్బందితో ఏనుగును పట్టుకొనేందుకు ప్రయత్నాలు తున్నాయన్నారు. ప్రజలందరూ బయటకు రాకుండా ఇళ్లలోనే ఉండాలని సూచించారు. తమిళనాడు నుంచి ఒంటరి ఏనుగు వచ్చిందని, మంగళవారం రాత్రి 40 కిలో మీటర్లు వరకు ప్రయాణం సాగిందన్నారు. రేంజ్ ఆఫీసర్ బాలక్రిష్టారెడ్డి, డీఆర్ఓ థామస్, సిబ్బంది, ట్రాకర్స్‌లు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి..



మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన చింతమాకుల, చిగర మాకులపల్లె వాసులు

పులిచెర్ల(కల్లూరు): రాష్ట్ర అటవీ, విద్యుత్, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో బుధవారం ఆయన స్వగృహంలో టీడీపీ నుంచి పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ లో చేరారు. మండలంలోని చిగరమాకులపల్లె, చింతలవారిపల్లెకు చెందిన మోహన్, ఆనంద్, వారి కుటుంబ సభ్యులు, మరో పదిమంది వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికి కండువా కప్పి మంత్రి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజల అభ్యున్నతి కోసం చేస్తున్న సేవలకు ఆకర్శితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు పోకల అశోక్ కుమార్, నేతలు బాలకృష్ణ రాజు, మోహన్‌రెడ్డి, వెంకట రమణ, జయప్రకాష్ పాల్గొన్నారు.

అనుబంధాలకు ప్రతీక రక్షాబంధన్



అన్న రామ్‌ప్రసాద్ రెడ్డికి రాఖీ కడుతున్న మంత్రి రోజా

నగరి : అనుబంధాలకు ప్రతీక, మమతానురాగాలకు నెలవు రక్షాబంధన్ పండుగ అని మంత్రి ఆర్కేరోజా అన్నారు. బుధవారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా తన నివాసంలో ఆమె రక్షాబంధన్ వేడుకలను జరుపుకున్నారు. సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డికి రాఖీ కట్టి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనంగా ఆత్మీయంగా ఆచరించే రాఖీ పౌర్ణమిని జరుపుకోవడం చాలా ఆనందాన్ని ఇస్తుందన్నారు. అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల తమ మధ్యన ఉండే ప్రేమానురాగాలకు ఈ పండుగ ప్రతీక అని తెలిపారు. సోదరి రాఖీ కడితే సోదరుడు తమకు అండగా ఉంటానని భరోసా ఇచ్చే పండుగ రాఖీ అన్నారు. సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సోదరికి తాము ఎప్పుడూ అండగా ఉంటామని, ఆమె మహోన్నత శిఖరాలకు ఎదగాలని, ఉన్నత భవిష్యత్తుతో రాణించాలని కోరుకున్నట్లు తెలిపారు.

వైఎస్సార్ కుటుంబానికి రుణపడి ఉంటా

- చంద్రబాబు పేదల ద్రోహి
- తాగుబోతులకు లీడర్
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: రాజకీయ భవిష్యత్తును అందించిన వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి తాను సేవకుడై పని చేస్తానని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. బుధవారం మండల పరిధిలోని సూరయ్యపాళ్యం ఎస్టీ కాలనీలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ భిక్షపెట్టిన వైఎస్సార్ కుటుంబానికి సేవకుడిగా ఉంటానని, ఎవరు ఏమన్నా ఆకుటుంబంతోనే తన పయమని స్పష్టం చేశారు. పేదలను విద్యావంతులు చేయాలనే తపనతో సంక్షేమ పథకాలను అందిస్తున్న జగనన్నకు మరింత రుణపడి ఉంటామని, అందుకే వైఎస్సార్, వైఎస్ జగనన్న ఫొటోలను తన ఇంటికి ఏర్పాటు చేస్తే వాటిపై టీడీపీ నాయకులు రాజకీయం చేయడం సబబు కాదన్నారు. వైఎస్సార్ కుటుంబ అభిమానిగా వైఎస్సార్, జగనన్న ఫొటో ఉన్న ఉంగరాన్ని ధరించానని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి రూ.3 లక్షలు ఇస్తే తాను రూ.20 లక్షలకు ఇస్తానని షూరిటీ ఇస్తానని అంటున్న చంద్రబాబుకే షూరిటీ లేదని ఎద్దేవ చేశారు. అధికారం పోయి మానవత్వం లేకుండా మాట్లాడుతున్న చంద్రబాబు ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని ప్రజలను మభ్యపెట్టేందుకు చూస్తున్నారని ఆరోపించారు. పోలీస్ వ్యవస్థపై దాడులు చేసి, కానిస్టేబుల్ కళ్లు పోగొట్టిన నీచుడు చంద్రబాబు అని, కనీసం కళ్లు పోయిన కానిస్టేబుల్‌ను పరామర్శించిన పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఒక ఇంటికి వెళ్లి తమ ప్రభుత్వం ఇది చేశానని ధైర్యంగా చెప్పగలరా అని సవాల్ విసిరారు. చంద్రబాబు పేదల ద్రోహి అని విమర్శించారు. తాను అధికారంలోకి వస్తే రెండు వేలు ఉన్న మద్యాన్ని 3 వందలకే ఇస్తానని, యువతను మద్యానికి బానిసలుగా మార్చేందుకు ప్రోత్సాహిస్తున్న చంద్రబాబుకు ఓటు అడిగే అర్హత లేదన్నారు. చంద్రబాబు కుట్రలను జనమంతా గమనిస్తున్నారని తెలిపారు. జగనన్న సంక్షేమ పాలనలో ప్రజలందరూ బాగున్నారని, రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

పీకేఎం వైస్ చైర్మన్‌గా బాబర్



కదిరి: పలమనేరు, కుప్పం, మదనపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పీకేఎం) వైస్ చైర్మన్‌గా ఎం.బాబర్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. బాబర్ ప్రస్తుతం విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా ఉంటూ ఈ మధ్యే అసిస్టెంట్ సెక్రెటరీగా పదోన్నతి పొందారు. చిత్తూరు జిల్లా సదుంకు చెందిన బాబర్... సెకండ్ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఓడి చెరువు మండలం వీరఓబునపల్లిలో చాలా కాలం టీచర్‌గా పనిచేశారు. స్థానిక మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్న టీచర్‌ను వివాహం చేసుకొని కదిరిలోనే కాపురం ఉండేవారు. అనంతరం గ్రూప్–2కు ఎంపికైన బాబర్ ఆ తర్వాత కదిరి మున్సిపల్ కమిషనర్‌గా, ఆ తర్వాత జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారిగా పనిచేశారు. అనంతరం బదిలీపై ఏపీపీఎస్సీకి వెళ్లారు. ప్రస్తుతం పలమనేరు, కుప్పం, మదనపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ (పీకేఎం) అథారిటీ వైస్ చైర్మన్‌గా బదిలీ అయ్యారు.

పసికందు తల్లిదండ్రులు అరెస్ట్


చిత్తూరు అర్బన్: పసికందును ఆస్పత్రిలో వదిలి వెళ్లిన కేసులో తల్లిదండ్రులను బుధవారం చిత్తూరు టూటౌన్ పోలీసులు అరెస్ట్ చూపించి, 41ఏ నోటీసులు జారీ చేశారు. చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి బాత్‌రూంలో ఓ తల్లి ఆడ బిడ్డను ప్రసవించి అక్కడే వదిలి పరారైన విషయం విధితమే. దీనిపై 'సాక్షి'లో వచ్చిన వరుస కథనాలకు జిల్లా యంత్రాంగం స్పందిస్తూ విచారణ చేపట్టింది. ఆపై ఆస్పత్రి అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ మద్దాయ్య ఆచారి ఆదేశాలతో పోలీసులు ఇంతకీ ఆ తల్లి ఎవరనే విషయంపై దర్యాప్తు ప్రారంభించారు. రెండు రోజుల్లోనే కేసును ఛేదించారు. బాత్ రూంలో వదిలిపెట్టిన బిడ్డకు తల్లిదండ్రులు బంగారుపాళ్యం మండలం తగ్గువారిపల్లెకు చెందిన అఖిల, మహేష్‌గా గుర్తించి విచారణ పూర్తిచేశారు. ఈమేరకు పసికందు తల్లిదండ్రులను బుధవారం అరెస్ట్ చూపించి..41ఏ నోటీసులు ఇచ్చామని సీఐ పేర్కొన్నారు.

పల్లెవాసులకు పక్కాగా ఆస్తి హక్కు

గ్రామాల్లోని స్థలాలను రీసర్వే చేసి హద్దులు నమోదు చేసి హక్కు పత్రాలను అందించే ప్రక్రియ మొదలైంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలాన్ని పెంచేలా.. గ్రామాల అభివృద్ధిలో కొత్త అధ్యాయాన్ని సృష్టించేలా స్వమిత్వా యోజన పథకం గ్రామీణులకు వరంలా మారింది. ఆస్తిపై స్పష్టమైన యాజమాన్య హక్కులను కల్పించడం.. డ్రోన్ టెక్నాలజీతో ల్యాండ్ పార్సిల్స్ మ్యాపింగ్ చేయడం .. అర్హులైన కుటుంబాలకు చట్టపరమైన యాజమాన్య కార్డులను జారీ చేయడం ఈపథకం లక్ష్యం. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ, రాష్ట్ర పంచాయతీరాజ్, రెవెన్యూశాఖలు సంయుక్తంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి.

- స్వమిత్వా పథకం కింద యాజమాన్య హక్కులు
- కసరత్తు ప్రారంభించిన అధికారులు
- జిల్లాలో 697 పంచాయతీల్లో రీ సర్వే
- డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానంతో సరిహద్దుల గుర్తింపు
- యాజమాన్య హక్కుల సమస్యలకు శాశ్వత పరిష్కారం





గుడిపాల: ముత్తూకూరుపల్లెలో సర్వే చేస్తున్న సిబ్బంది(ఫైల్)

చిత్తూరు కార్పొరేషన్: పల్లెలో తరతరాలుగా ఎలాంటి పత్రాలు లేని స్థలాలకు యాజమాన్య హక్కులు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. స్వమిత్వ పథకం కింద గ్రామాల్లోని స్థలాలను రీసర్వే చేసి హద్దులు నమోదు చేసి హక్కు పత్రాలను అందించనున్నారు. జిల్లాలోని పలు గ్రామాల్లో అధికారులు సర్వే ప్రక్రియ ప్రారంభించారు. స్థలానికి సంబంధించిన యాజమాన్య హక్కులు తరతరాలుగా లేకపోవడంతో ఆర్థిక అవసరాల కోసం తమ ఇంటిని తాకట్టు పెట్టి రుణం పొందడానికి అవకాశం ఉండేది కాదు. అలాగే గ్రామకంఠాల్లో ఉన్న ఇళ్లు, పశువుల కొట్టాలు, గడ్డివాములు తదితర వాటికి గ్రామాల్లోని ప్రజల వద్ద ఎలాంటి హక్కుపత్రాలు ఉండేవి కావు. ఈ సునిశితమైన అంశాన్ని పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపట్టింది.

ఇలా అమలు

జిల్లాలో ఇళ్ల స్థలాలకు యాజమాన్య హక్కులను ఖరారు చేస్తూ రూపొందించిన కార్డులను పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన (స్వమిత్వ సర్వే ఆఫ్ విలేజ్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రొవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్) కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. డ్రోన్ సర్వే సాంకేతిక పరిజ్ఞానం ద్వారా గ్రామాల్లోని ఇళ్లను సర్వే చేసి ప్రజలకు రికార్డ్ ఆఫ్‌రైట్స్ కార్డులు మంజూరు చేస్తారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆస్తి హక్కులపై స్పష్టత ఇస్తారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయడం వల్ల ఇంటికి సంబంధించిన డ్యాకుమెంట్లు ఏవి అవసరమున్నా మీసేవ ద్వారా తీసుకునే వెసులుబాటు కలుగుతుంది. బ్యాంకు రుణం పొందేందుకు వీలవుతుంది. ఇంటింటి సర్వేలో మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులు పాల్గొంటారు. వివరాల సేకరణపూర్తయిన తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

ముమ్మరంగా ఇంటింటి సర్వే

జిల్లాలోని 697 పంచాయతీల్లో స్వమిత్వ పథకం కింద రీసర్వే చేయనున్నారు. జీడీనెల్లూరు మండలం అగరమంగళం, గుడిపాల మండం ముత్తుకూరు గ్రామంలో సర్వే పూర్తి అయింది. పలమనేరు నియోజకవర్గంలో 35 గ్రామాలు, కుప్పంలో నియోజకవర్గంలో 43, చిత్తూరు నియోజకవర్గంలో 1, జీడీనెల్లూరు నియోజకవర్గంలో 1, పూతలపట్టు నియోజకవర్గంలో 2, పుంగనూరు నియోజకవర్గంలో 14 కలిపి మొత్తం 96 గ్రామాల్లో ఇంటింటి సర్వే పనులు జరుగుతున్నాయి.

వివరాలు నమోదు ఇలా

స్వమిత్వ పథకం ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డ్రోన్ కెమెరాలతో స్థలం ఫోటోలు తీస్తారు. ఇళ్లు, ఇంటి చుట్టుపక్కల ఖాళీ స్థలం కొలతలు తీసుకుంటారు. ఇంటి యజమాని పేరు, వివరాలు సేకరిస్తారు. ఇరుగుపొరుగు వారి పేర్లతో హద్దులు నమోదు చేస్తారు. రోడ్డు ఉంటే ఆ వివరాలు పొందుపరుస్తారు. ఖాళీగా ఉన్న ఇంటి స్థలాలను కొలుస్తారు. ఎలాంటి పొరబాట్లకు తావు లేకుండా అన్ని వివరాలను పక్కాగా నమోదు చేసుకుంటారు.

సర్వే చేస్తున్నాం



జిల్లాలోని గ్రామాల్లో ఆస్తులకు సంబంధించిన డ్యాకుమెంట్లకు అవసరమైన ప్రాథమిక సర్వే కసరత్తు జరుగుతోంది. ప్రసుత్తం జరుగుతున్న ప్రక్రియ అనంతరం ప్రభుత్వం నుంచి నిర్ధిష్టమైన ఆదేశాలు వచ్చే ఆ మేరకు చర్యలు తీసుకుంటాం. - లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి



చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,490
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,000
రిటైల్ వెండి గ్రాము	రూ.76.00

బెంగళూరులో మాగాండ్లపల్లె యువకుడు మృతి



సూర్యవర్ధన్‌రెడ్డి (ఫైల్)

పుంగనూరు: బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మాగాండ్లపల్లెకి చెందిన యువకుడు దుర్మరణం చెందాడు. మాగాండ్లపల్లెకి చెందిన శ్రీరాములురెడ్డి కుమారుడు సూర్యవర్ధన్ రెడ్డి బెంగళూరులోని ఎలక్ట్రానిక్ సిటీలోగల ఓప్రైవేటు కంపెనీలో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఆఫీసుకు యథావిధిగా ద్విచక్రవాహనంలో హెల్మెట్ ధరించి వెళుతుండగా, అతివేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సూర్యవర్ధన్‌రెడ్డి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. విషయం తెలియడంతో మాగాండ్లపల్లె శోకసంద్రమైంది.

కాణిపాకం బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులకు బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే, ఆలయ చైర్మన్, ఈఓ



తిరుపతిలో టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డికి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే, ఆలయ చైర్మన్, ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులను పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి ఈఓ ఆహ్వానించారు. వారు బుధవారం సాయంత్రం ఆలయ అర్చకులు, వేద పండితులతో కలిసి తిరుపతిలోని మంత్రి నివాసంలో మంత్రి దంపతులను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సెప్టెంబర్ 18వ తేదీ చవితిరోజు నుంచి 21 రోజుల పాటు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామని, తప్పక రావాలని కోరారు.

టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డికి ఆహ్వాన పత్రిక

కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు కోరారు. వారు బుధవారం భూమనను తిరుపతిలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం



కాణిపాక ఆలయంలో భక్తులతో నిండిపోయిన క్యూలు

కాణిపాకం(యాదమరి):కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి అనుబంధ శ్రీవరదరాజుల స్వామి ఆలయంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా బుధవారం సత్యనారాయణ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తిని శ్రీసత్యనారాయణ అవతారంలో అలంకరణ చేసి ఆలయ కల్యాణ మండపంలో కొలువుదీర్చి వ్రతం నిర్వహించారు.పెద్ద సంఖ్యలో భక్తులు వ్రత పూజల్లో పాల్గొన్నారు.

కాణిపాకం ఆలయంలో భక్తుల రద్దీ

శ్రావణమాసం పౌర్ణమి సందర్భంగా బుధవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో భక్తులతో కిటకిట లాడింది. ఉదయం నుంచి స్వామివారి దర్శనార్థం భక్తులు తరలి రావడంతో ఆలయంలోని కంపార్ట్‌మెంట్‌లు, క్యూలైన్లు నిండిపోయాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు.

పుంగనూరు ఘటనలో పోలీసుల సమన్వయం భేష్

- నేరస్తులకు శిక్ష పడినప్పుడే బాధితులకు న్యాయం జరిగినట్టు
- పోలీసు ఉద్యోగమంటేనే కత్తిమీద సాము లాంటిది
- జిల్లా నేర సమీక్షలో చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి



ఎస్పీ నుంచి రివార్డు అందుకుంటున్న సీఐ రవిశంకర్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: పోలీసు ఉద్యోగమంటే కత్తిమీద సాములాంటిదని.. ఇందుకు పుంగనూరులో ఇటీవల జరిగిన అల్లర్లే సాక్ష్యమని చిత్తూరు ఎస్పీ రిషాంత్ రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం చిత్తూరులోని పోలీసు శిక్షణా కేంద్రంలో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పుంగనూరులో సృష్టించిన అల్లర్లలో పోలీసు అధికారులు సంయమనంతో వ్యవహరించి నిందితుల వ్యూహాలను తిప్పికొట్టారని ప్రశంసించారు. ప్రతి ఒక్క నేరంలో నిందితులకు శిక్ష పడినప్పుడే బాధితులకు న్యాయం జరిగినట్టని, ఇందుకు దర్యాప్తు, సాక్ష్యాల సేకరణ కీలకమన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన దర్యాప్తు పూర్తిచేసి, కోర్టుల్లో ఛార్జ్‌షీట్ వేయాలన్నారు. ఇసుక రవాణా, ఎర్రచందనం, నాటుసారా, అక్రమ మద్యం తదితర నేరాల్లో పదే పదే నిందితులుగా ఉన్న వారిపై పీడీ యాక్టు ప్రయోగించడానికి ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో చైతన్యం రావాలని, ఇందుకోసం ప్రతి స్టేషన్‌లోనూ సదస్సులు నిర్వహించాలన్నారు. కేసుల దర్యాప్తులో ఉత్తమ ప్రతిభ కనబరచిన చిత్తూరు పశ్చిమ సీఐ రవిశంకర్‌రెడ్డి, తవణంపల్లె ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, బంగారుపాళ్యం ఎస్ఐ రాంభూపాల్‌కు నగదు రివార్డులు ఇచ్చి అభినందించారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మి, నాగేశ్వరరావు, డీఎస్పీలు శ్రీనివాసమూర్తి, శ్రీనివాసరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సేవలు విస్తృతం



మాట్లాడుతున్న డీజీఎం వెంకోబారావు

చిత్తూరు కార్పొరేషన్: బీఎస్ఎన్ఎల్ సేవలు విస్తృతం చేయనున్నట్లు డీజీఎం వెంకోబారావు తెలిపారు. బుధవారం బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో వినియోగదారుల సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం 74 4జీ టవర్లు ఉన్నాయని , మరో 113 టవర్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. డీఈ సురేంద్రనాథ్ మాట్లాడుతూ సంస్థ పరంగా సిమ్, ల్యాండ్‌లైన్, బ్రాండ్‌బ్యాండ్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. వినియోగదారులు 9441299999 నంబర్‌కు మేసేజ్ చేసి తమ సర్వీసు 2 జీ, 3జీ తెలుసుకుని 4జీకు మార్చుకోవాలని సూచించారు. గతంలో పేపర్ అప్లికేషన్ ద్వారా సిమ్‌కార్డు పొందిన వారు ఈకేవైసీ చేసుకోవాలన్నారు. ఈకేవైసీ చేస్తే కొత్త సిమ్‌కార్డును అందిసున్నామని తెలిపారు. సీఏజీ సభ్యుడు చిట్టిబాబు, ఏజీఎం అబిద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.


డాక్యుమెంట్ రైటర్ల సమ్మె

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర వ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొత్తగా ప్రవేశపెట్టనున్న ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌కు వ్యతిరేకంగా జిల్లాలోని డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండర్స్ పెన్‌డౌన్ చేశారు. రైటర్ల సమ్మెతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు బోసిపోయియి. రోజూ 70 డాక్యుమెంటేషన్లు జరుగుతుండగా బుధవారం ఆరు మాత్రమే జరిగాయి. రైటర్లు, స్టాంప్‌వెండర్స్ చిత్తూరు అర్బన్, రూరల్ కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సంఘం అధ్యక్షుడు సీవీ ఆనంద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రవి, కార్యదర్శి త్యాగరాజన్, కోశాధికారి హేమచంద్ర, ప్రెస్ ఇన్‌చార్జి రూపేస్, నేతలు చందు, చిరంజీవి, శ్రీహరి, ప్రేమ పాల్గొన్నారు.

600 కిలోల ఉలవలు తినేశారు

చౌడేపల్లె: రైతులకు ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న ఉలవలను ఆర్బీకేల్లోని అగ్రికల్చర్ అసిస్టెంట్లు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి, సొమ్ము చేసుకున్న ఘటన బుధవారం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే ప్రభుత్వం వేరుశెనగ పంట సాగు చేయని రైతులకు 80 శాతం రాయితీతో ఉలవలు పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా చౌడేపల్లె మండలానికి సుమారు 1,600 క్వింటాళ్ల విత్తనాలను ప్రభుత్వం కేటాయించింది. మండలంలోని 14 ఆర్బీకేలకు అధికారులు వీటిని సరఫరా చేశారు. చౌడేపల్లె ఆర్బీకేకి వచ్చిన 600 కిలోల ఉలవ విత్తనాలను అగ్రికల్చర్ అసిస్టెంట్ హర్షద్, చారాల ఆర్బీకే అగ్రికల్చర్ అసిస్టెంట్ పాపయ్య కలిసి బుధవారం చారాల కురప్పల్లెకు చెందిన ఓ వ్యాపారికి విక్రయించారు. దీనిని గుర్తించిన స్థానిక రైతులు మీడియాకు సమాచారం ఇచ్చారు. ఈ విషయమై ఏఓ జ్యోతమ్మను వివరణ కోరగా అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఉలవలను వ్యాపారికి విక్రయించిన మాట వాస్తవమేనన్నారు. ఆ వ్యాపారి నుంచి ఉలవలను స్వాధీనం చేసుకుని ఆర్బీకేలకు తరలించినట్లు చెప్పారు. వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

స్త్రీనిధి చెల్లింపులకు పేటీఎం విధానం



పేటీఎం మిషన్‌లు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : స్త్రీ నిధి రుణ బకాయిల చెల్లింపులకు పేటీఎం విధానం అమలు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పేటీఎం మిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యుల జీవనోపాధి మెరుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం స్త్రీనిధి రుణాలు అందజేస్తోందన్నారు. మహిళా సంఘాల సభ్యులు ఆ రుణ బకాయిల చెల్లింపులు ఎస్‌హెచ్‌జీలు, వీఓల నుంచి చెల్లించేవారని చెప్పారు. రికవరీ చేసిన మొత్తం బదిలీ చేసేందుకు ఆలస్యం అయ్యే పరిస్థితుల్లో సభ్యులపై వడ్డీ భారం పడేదన్నారు. ఆ సమస్యలను పరిష్కరించేందుకు స్త్రీనిధి బకాయిల చెల్లింపులకు పేటీఎం విధానం తీసుకొచ్చినట్లు చెప్పారు. డీఆర్‌డీఏ పీడీ తులసి మాట్లాడుతూ పేటీఎం విధానాన్ని రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా చిత్తూరు జిల్లాను ఎంపిక చేశారన్నారు. జిల్లాలోని ఐరాల, పూతలపట్టు మండలాల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- పాలారు చెక్‌డ్యామ్‌లో పడి తమిళ యువకుడు మృతి

కుప్పంరూరల్: ఈత సరదా ఓ తమిళ యువకుడిని ప్రాణాలను తీసింది. సరదాగా స్నేహితులతో కలిసి ఈత కోరిక తీర్చుకోవాలని వచ్చిన ఆ యువకుడిని మృత్యువు వెంటాడింది. వివరాల్లోకి వెళితే.. తమిళనాడు రాష్ట్రం వాణియంబాడికి చెందిన నలుగురు స్నేహితులు ఆంధ్ర సరిహద్దుల్లో ఉన్న కనకనాశమ్మ దేవాలయం వద్ద ఉన్న చెక్‌డ్యామ్‌కు బుధవారం మధ్యాహ్నం చేరుకున్నారు. నలుగురిలో ధనుష్ (25), మరో యువకుడికి ఈత రాదు. వీరిద్దరు గట్టుపై కూర్చొని స్నానం చేస్తున్నారు.

నీరు బాగా లేదని ధనుష్ కొంత ముందుకు పోయి స్నానం చేసేందుకు ప్రయత్నించాడు. ఇంతలోనే ప్రమాదవశాత్తు నీటిలోకి జారిపోయాడు. స్నేహితులు ఎంత ప్రయత్నించినా ధనుష్‌ను కాపాడలేకపోయారు. స్థానికులు కుప్పం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ధనుష్ మృతదేహాన్ని బయటికి తీసి, పోస్టుమార్టమ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎం దొంగల అరెస్టు

చిత్తూరుఅర్బన్: ఏటీఎంలో నగదు విత్ డ్రా చేసుకోవడానికి వచ్చేవారి చూపు మరల్చి.. కార్డుల ద్వారా నగదు చోరీ చేసే ప్రొద్దుటూరు, కడపకు చెందిన నిందితులు మునికుమర్ (30), ఈశ్వరయ్య (28)ను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం నిందితుల అరెస్టు చూపించారు. వివరాలను సీఐ విశ్వనాథరెడ్డి వెల్లడించారు. చిత్తూరుకు చెందిన లక్ష్మీదేవి గత జనవరి మార్కెట్ చౌకు వద్ద డబ్బులు తీసుకోవడానికి ఏటీఎం కేంద్రానికి వెళ్లారు. అప్పటికే అక్కడ కాపు కాచిన మునికుమార్, ఈశ్వరయ్య ఆమె నుంచి అసలు ఏటీఎం కార్డు తీసుకుని ఆమెకు నకిలీ కార్డు ఇచ్చి పని చేయలేదని పంపించేశారు. ఆమె వెళ్లిపోయిన తరువాత ఖాతాలో ఉన్న రూ.43 వేలు చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.